## కాలుష్య నివారణకు

# పేపర్ బ్యాగులు



ఔత్సాహిక పారిశ్రామికవేత్త కోగంటి యామిని తనదైన శైలిలో నెలకొల్పిన 'పాకేజింగ్ ఇండస్ట్రీ' ముఖ్య ఉద్దేశ్యం...
'పెరుగుతున్న కాలుష్య నివారణ'...
నిజమే! ఎటు చూసినా కాలుష్యం..
పెరుగుతున్న జనాభాతోపాటు పెరుగుతున్న వ్యర్థ పదార్థాలు.
వాటిని నింపుతున్న ప్లాస్టిక్ సంచులు...
నిర్మూల్యం కాని పదార్థం ఈ ప్లాస్టిక్ కవర్లు...
మనం పారేసిన చెత్తను తింటున్న జంతువులు..
వాటితోపాటు లోపలికి చేరుకుంటున్న ప్లాస్టిక్ కవర్లు.
ఇలాంటి కాలుష్య వార్తలు పేపర్లలో చదివి తాను ఏదైనా చేయాలనే ఉద్దేశ్యంతో పేపర్ బ్యాగుల ఇండస్ట్రీని నెలకొల్పానని యామిని అంటారు.
ప్రతిరోజూ ఎన్నో వస్తువులు కొనుగోలు చేసినపుడు తప్పనిసరిగా క్యారీ బ్యాగుల అవసరం వుంటుంది. వాటిలో కొన్నిటికైనా కాగితంతో చేసిన బ్యాగులు వాడాలి. అప్పుడే కొంతైనా కాలుష్యం అరికట్టగలుగుతాము.
విద్యావంతురాలైన యామిని స్వశక్తితో ఈ ఇండస్ట్రీని 16 లక్షల పెట్టుబడితో రెండేళ్ళ క్రితం స్థాపించారు. రెండురోజుల ట్రైనింగు తీసుకున్న వీరు రకరకాల సైజులలో క్యారీ బ్యాగులను తయారుచేస్తున్నారు. 'సాదావి, డబల్ కలర్స్. వాటి సైజులనుబట్టి ధరలు వుంటాయి.

మావద్దకి వచ్చే కస్టమర్లు ఈ పేపర్ బ్యాగులను ఎక్కువగా పెళ్ళిళ్లలోనూ, పేరంటాలలోనూ తాంబూలాలు ఇవ్వడానికి ఉపయోగిస్తున్నారు. సైజు 18/18 సెం.మీ వుండి వాడటానికి అనువుగా వుంటున్నాయి. బర్త్‌డేల సందర్భంగా రిటర్న్ గిఫ్టులకోసం కూడా ఉపయోగిస్తున్నారు అని అంటారు.
ఈ యూనిట్ నెలకొల్పడంలో ఏదైనా ఇబ్బందులెదురైనాయా? అని అడిగినపుడు 'ఒక్క మార్కెటింగ్ విషయంలో ఇబ్బందులు తప్ప వేరే ఏమీలేవు. దానిని ఎదుర్కోవాలంటే ముందు ప్రజల్లో చైతన్యం రావాలి. ప్లాస్టిక్ సంచుల వినియోగానికి స్వస్తి పలకాలి. పేపర్ బ్యాగుల వినియోగం పెరగాలి అన్నారు. భారీ పెట్టుబడితో స్థాపించిన ఈ పరిశ్రమ ముఖ్యంగా మార్కెటింగ్ విభాగం చూస్తున్న యామిని భర్త విజయభాస్కర్ సహాయ సహకారాలు ఎంతో ముఖ్యమని, తమ వద్ద పదిమంది వర్కర్లు పనిచేస్తున్నట్లు, అందరూ మహిళలే వున్నట్టు చెప్పారు.

'మహిళా పారిశ్రామికవేత్తలని ప్రోత్సహించే బాంకులలో యూనియన్ బ్యాంకునుంచి, ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డునుంచి యూనిట్‌కి కావలసిన ఆర్థిక సహాయం పొందాము. హైదరాబాద్ నగర శివారులో ఫాక్టరీని స్థాపించాము. మా పేపర్ బాగ్ నాణ్యతలోను, ధృఢత్వంలోనూ ముందుంటాయి. చాలా ఆకర్షణీయంగా, బయటికి తీసుకెళ్లడానికి అనుకూలంగా వుంటాయి. కష్టమర్లు కోరిన డిజైన్లలో విభిన్నంగా రూపుదిద్దుకుంటాయి మా క్యారీ బ్యాగులు.ప్రజలలో చైతన్యం తీసుకురావడానికి ముందు వారి మనసులో మార్పు రావాలి. చౌకలో ఒక రూపాయికే ప్లాస్టిక్ సంచి వస్తున్నపుడు ఎక్కువ ధర పెట్టి అంటే మూడు రూపాయలు పెట్టి ఎందుకు కొనాలి అనే భావం విడనాడాలి. ఎలీప్ (అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్)లో మెంబరుని అవటంవల్ల ఎక్కడ పారిశ్రామిక ప్రదర్శనలు జరిగినా తెలుస్తుంటాయి. మేము మా వంతు కృషిగా కాలుష్య నివారణకు మా పేపర్ బ్యాగుల ప్రదర్శనలు ఏర్పాటు చేస్తుంటాము' అని వివరంగా తెలియచేశారు యామిని.

భవిష్యత్ ప్రణాళికల గురించి అడిగినపుడు-  పదిమందికి ఉపాధి కల్పిస్తున్నామనే తృప్తి, భవిష్యత్తులో లాభాల బాటలో పయనిస్తామనే ఆశ వున్నాయి. ఈ పేపర్ క్యారీ బ్యాగుల యూనిట్‌లు చాలా తక్కువగా వున్నాయి. ఇంకా ఇటువంటి ఫ్యాక్టరీలు రావాలనే నా ఆకాంక్ష' అని ఆత్మవిశ్వాసంతో తన అభిప్రాయం తెలియచేశారు.

- మణినాథ్ కోపల్లె